RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:10 28-6-2025 శనివారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-

## టూరిజం సదస్సు క్యారవాన్లను ప్రారంభించిన చంద్రబాబు




వెలగపూడి,(టుడే విదుర, జూన్ 27): ఏపీలో పర్యాటక రంగానికి సరికొత్త ఉత్తేజం ఇచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఈ రంగంలో ఏకంగా ?2 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ప్రణాళికలో భాగంగా విజయవాడ లో శుక్రవారం టూరిజం కాన్‌క్లేవ్‌ను ఘనంగా నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి సీఎం చంద్రబాబు పర్యాటక క్యారవాన్లను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.

రాయితీలు, ప్రోత్సాహకాలు..

రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ఉన్న అపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవడమే ఈ కాన్‌క్లేవ్ ముఖ్య ఉద్దేశమని సీఎం చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పర్యాటక ప్రాజెక్టుల కు పారిశ్రామిక హోదా కల్పించిందని, ఈ నిర్ణయం ద్వారా పర్యాటక రంగంలో పరిశ్రమలకు లభించే అన్ని రకాల ప్రోత్సాహకాలు, రాయితీలు వర్తించనున్నట్టు చెప్పారు. ఈ సదస్సు వేదికగా ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) సుమారు ?10,039 కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలను కుదుర్చుకోనుంది.మెయిన్? సిటీస్?లో అతిపెద్ద హోటళ్లు..రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విశాఖపట్నం అమరావతి, తిరుపతి లలో భారీ హోటళ్ల నిర్మాణానికి సంబంధించిన ఒప్పందాలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ పెట్టుబడులతో రాష్ట్రంలో పర్యాటక మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా భారీగా పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం పర్యాటక రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించడం పట్ల పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## కుప్పం ద్రవిడ వర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులు..



కుప్పం, 27జూన్(ఆంధ్రప్రభ) : కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కోర్సులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ మంజూరు చేయడం పట్ల కుప్పం ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. విద్యార్థులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఈ కోర్సులు మంజూరవడం కుప్పం విద్యాభివృద్ధిలో మరో కీలక ముందడుగు అన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు కుప్పం ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేస్తూ కుప్పం విద్యారంగ అభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుందన్నారు. చాలా కాలంగా విద్యార్థులు ఎదురుచూస్తున్న ఇంజనీరింగ్ కోర్సులు ఇప్పుడు ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇదంతా రాష్ట్ర ముఖ్యమంత్రి, కుప్పం ముద్దుబిడ్డ చంద్రబాబుతోనే సాధ్యమవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

## అంతరిక్షంలో అడుగుపెట్టనున్న పాలకొల్లు అమ్మాయి

పాలకొల్లు,(టుడే విదుర, జూన్ 27): :తెలుగు అమ్మాయి దంగేటి జాహ్నవి అంతరిక్షంలోకి అడుగుపెట్టే అద్భుతమైన అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్ అయిన జాహ్నవి నాసా ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ క్రమంలోనే అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ 2029లో చేపట్టనున్న టైటాన్ స్పేస్ మిషన్ కోసం వ్యోమగామి అభ్యర్థిగా జాహ్నవి ఎంపికయ్యారు. ఈ ఘనత సాధించిన మొదటి భారతీయురాలుగా జహ్నవి నిలిచారు.ఈ నేపథ్యంలో దంగేటి జహ్నవి (23) గురించిన వివరాలను తెలుసుకుందాం... దంగేటి జాహ్నవి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు. జహ్నవి తల్లిదండ్రులు శ్రీనివాస్, పద్మశ్రీలు కువైట్‌లో



ఉద్యోగం చేస్తున్నారు. అయితే తల్లిదండ్రులు విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నప్పటికీ జాహ్నవి పాలకొల్లులో అమ్మమ్మ దగ్గరే పెరిగారు.జహ్నవి పాలకొల్లులోనే ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేశారు. తర్వాత పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యను పూర్తిచేసుకున్నారు. అయితే జహ్నవికి అంతరిక్షయానం పట్ల ఆసక్తి ఉంది. సైన్సు, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మాథమేటిక్స్ విద్యపై చైతన్యాన్ని కలిగించే కార్యక్రమాల్లో జహ్నవి యాక్టివ్‌గా పాల్గొన్నారు.ఇస్రో విద్యా కార్యక్రమాలలో కూడా జహ్నవి ప్రసంగాలు ఇచ్చారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలు సహా ప్రముఖ సంస్థలలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగాలు చేశారు.అంతర్జాతీయ ఖగోళ శోధన సహకారానికి జహ్నవి చేసిన కృషి... పనోరమిక్ సర్వే టెలిస్కోప్ – రాపిడ్ రెస్పాన్స్ సిస్టమ్ నుంచి వచ్చిన డేటా ఆధారంగా తాత్కాలిక ఉల్క ఆవిష్కరణకు దారితీసింది.ఆమె అతి పిన్న వయస్కురాలైన విదేశీ అనలాగ్ వ్యోమగామిగా నిలవడమే కాకుండా... స్పేస్ ఐస్లాండ్ జియోలజీ ట్రైనింగ్‌కు ఎంపికైన మొదటి భారతీయురాలు కూడా నిలిచారు. అలాగే, జాహ్నవి...




నాసా స్పేస్ యాప్స్ ఛాలెంజ్‌లో పీపుల్స్ ఛాయిస్ అవార్డు, ఇస్రో వరల్డ్ స్పేస్ వీక్ యంగ్ అచీవర్ అవార్డుతో సహా అనేక ప్రశంసలను అందుకున్నారు.

## టెక్నాలజీతో అభివృద్ధి వైపు అడుగులు : సీఎం చంద్రబాబు




(టుడే విదుర, జూన్ 27): గుంటూరు జిల్లాలో కళాశాల ఇన్నోవేషన్ సెంటర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోలీస్ హ్యాకథాన్-2025లో సీఎం ప్రత్యేకంగా పాల్గొన్నారు. యువతలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, కృత్రిమ మేధస్సు ఆధారంగా పోలీసింగ్‌ను మెరుగుపరచడానికి ఈ హ్యాకథాన్ నిర్వహించారు. ముఖ్యమంత్రి తన సందేశంలో యువతను నూతన ఆవిష్కరణలు చేయాలని ప్రోత్సహిస్తూ.. టెక్నాలజీ ద్వారా అభివృద్ధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

## విద్యుత్ చార్జీలపై మంత్రి గొట్టిపాటి క్లారిటీ

విశాఖపట్నం:(టుడే విదుర, జూన్ 27): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. గత జగన్ ప్రభుత్వం ప్రజలపై తొమ్మిది సార్లు విద్యుత్ భారాలు మోపిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లోపు వీలైనంత వరకు విద్యుత్ చార్జీలు తగ్గించాలనే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఇవాళ(శుక్రవారం) విశాఖపట్నంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. రాయలసీమ ప్రాంతంలో సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీలను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. 24 గంటల పాటు గ్రీన్‌ఎనర్జీని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఉద్ఘాటించారు మంత్రి గొట్టిపాటి రవి కుమార్.

# భార్యాభర్తలను కట్టేసి.. 25 తులాల బంగారం దోచుకెళ్లిన దుండగులు




శ్రీసత్య సాయి జిల్లా (టుడే విదుర, జూన్ 27): హిందూపురం మండలంలోని కిరికెరలో జరిగిన దోపిడీ ఘటన స్థానిక ప్రజల్లో భయాందోళన సృష్టించింది. నిత్యానంద రెడ్డి ఆయన భార్య ఓమలను బంధించి, ఇంట్లో ఉన్న 25 తులాల బంగారం దుండగులు దోచుకెళ్లారు. ఈ ఘటన అర్ధరాత్రి సమయంలో జరిగింది. నిత్యానంద రెడ్డి ఆయన భార్య ఓమ ఇంట్లో ఉన్నప్పుడు అనుకోకుండా పలువురు దుండగులు వారి ఇంట్లోకి ప్రవేశించారు. ఆ క్రమంలో వారిద్దరిని బంధించి, ఇంట్లో ఉన్న పసిడిని దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు, వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు.ప్రాథమిక విచారణలో దుండగులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన వారిగా అనుమానిస్తున్నారు. వారు హిందీలో మాట్లాడారని, ఎవరినో చంపడానికి వచ్చామని చెప్పినట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన స్థానికులు మరింత భయాందోళన చెందుతున్నారు. డీఎస్పీ మహేష్, హిందూపురం సీఐ ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భార్యభర్తలను ప్రశ్నించి, దోపిడీకి సంబంధించిన మరింత సమాచారం సేకరించారు. పోలీసులు, దోపిడీకి సంబంధించిన ఆధారాలను సేకరించడానికి స్థానిక సీసీ టీవీ ఫుటేజీని కూడా పరిశీలిస్తున్నారు. ఈ దోపిడీ ఘటన గ్రామంలో భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు రేకెత్తించింది. ప్రజలు తమ భద్రత గురించి ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఈ తరహా దోపిడీలు జరగడం స్థానికుల్లో భయాన్ని కలిగిస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వారు దుండగుల గుర్తింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. కొత్త వ్యక్తులు లేదా ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపించినా, ఏదైనా జరిగినా వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# మెరిట్ ఎస్సీ,ఎస్టీలను పరిగణించరాదు

## సచివాలయ పదోన్నతులపై మార్గదర్శకాలు



అమరావతి,(టుడే విదుర, జూన్ 27): : సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, అడిషనల్ సెక్రటరీల్లో (నాన్ కేడర్) ఎస్సీ, ఎస్టీ అధికారుల పదోన్నతులపై సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది. అవి ఇలా ఉన్నాయి. మెరిట్, సీనియారిటీ ద్వారా ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు పొందిన పదోన్నతులను వారికిచ్చిన 15శాతం, 6శాతం రిజర్వేషన్లలో లెక్కించరాదు. మెరిట్ పోను మిగిలిన పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు వరుసగా 15, 6శాతం రిజర్వేషన్లు కల్పించాలి. ప్యానల్ సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పూర్తిగా అమలైతే వాటిని సమీక్షించాల్సిన అవసరం లేదు. అయితే ఈ రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదు. ఏదైనా కేటగిరీలో ఎస్సీ,ఎస్టీలు సరిపోయినంత మంది లేకుంటే, జనరల్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలి. వీటితోపాటు మరికొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి.


# విజయవాడలో మరో భారీ మోసం.. రంగంలోకి దిగిన పోలీసులు




విజయవాడ,(టుడే విదుర, జూన్ 27): ప్రజల ఆశలే పెట్టుబడిగా చేసుకుని పలువురు వ్యక్తులు పలు సంస్థలు స్థాపిస్తున్నారు. వారి నుంచి భారీగా పెట్టుబడుల రూపంలో నగదు దండుకుని ఆ తర్వాత.. ఆ సంస్థలను అర్ధాంతరంగా మూసేస్తున్నారు. తాజాగా అలాంటి సంఘటన విజయవాడ నగరంలో చోటు చేసుకుంది. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే.. అధిక వడ్డీ చెల్లిస్తామంటూ అద్విక ట్రేడింగ్ కంపెనీ ప్రచారం నిర్వహించింది. అందులో భాగంగా రూ. లక్ష పెట్టుబడి పెడితే.. నెలకు రూ. 6 వేలు చొప్పున వడ్డీ చెల్లిస్తామని ప్రచారం చేపట్టింది.దీంతో భారీగా ప్రజలు.. ఆ ట్రేడింగ్ సంస్థకు పరుగులు తీశారు. ఆ క్రమంలో సదరు ట్రేడింగ్ కంపెనీకి అధిక మొత్తంలో నగదు చెల్లించారు. అయితే ఈ ట్రేడింగ్ కంపెనీ వ్యవహారంపై పలువురిలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విజయవాడ నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ట్రేడింగ్ కంపెనీ నిర్వాహకుడు ఆదిత్యతోపాటు మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే ఈ సంస్థలో రూ. 300 కోట్లు వరకు నగదు దాదాపు 1200 మంది పెట్టుబడిగా పెట్టినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు.

# ఆమె నా ప్రియురాలు పెళ్లాపండి


## సినీ ఫక్కీలో 'హల్దీ'ని అడ్డుకున్న యువకుడు.. ఆగిపోయిన వివాహం
## జీవితం నాశనం చేశాడంటూ పోలీసులకు యువతి ఫిర్యాదు



నెల్లూరు (టుడే విదుర, జూన్ 27): కల్యాణ మండపంలో బంధుమిత్రులు, పెళ్లి కొడుకు సమక్షంలో వధువుకు సంప్రదాయబద్ధంగా హల్దీ (నలుగు కార్యక్రమం) వేడుక జరుగుతోంది. ఇంతో ఓ యువకుడు సినీ ఫక్కీలో తన స్నేహితులతో వేదిక వద్దకు వచ్చాడు. 'పెళ్లి ఆపండి. నేనూ పెళ్లికూతురు పదేళ్లుగా ప్రేమించుకుంటున్నాం' అంటూ అక్కడే ఉన్న సారెపళ్లేన్ని కాలితో తన్నాడు. ఊహించని ఈ ఘటనతో అందరూ నిర్ఘాంతపోయారు. చివరికి పెళ్లాగిపోయింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన యువతి లేగుంటపాడులో ఉంటున్న తన సమీప బంధువు ఇంటికి తరచూ వెళుతుండేది. ఈ క్రమంలో 2022లో నందవర్ధన్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇద్దరి పరిచయంపై ఇంట్లో తెలియడంతో ఆమె అతడితో మాట్లాడటం మానేసింది. దీంతో నందవర్ధన్ యువతి వెంటబడుతూ మాట్లాడక పోతే మనం తీసుకున్న ఫొటోలు అందరికీ చూపిస్తానని బెదిరించేవాడు. ఆమెకు పెళ్లి సంబంధాలు వచ్చినా చెడగొట్టేవాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు నవాబుపేట స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అతడిని పిలిపించి మందలించారు. ఈ క్రమంలో ఈ నెల 22న పెద్దలు యువతికి వివాహం నిశ్చయించారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో బంధువులు, పెళ్లికొడుకు సమక్షంలో హల్దీ కార్యక్రమం జరుగుతుండగా.. నందవర్ధన్ తన స్నేహితులతో అక్కడికి వచ్చాడు. పదేళ్లుగా తామిద్దరం ప్రేమించుకుంటున్నామంటూ యువతిని కాలితో తన్నడానికి ప్రయత్నించి అక్క డే ఉ న్న సారెపళ్లేన్ని తన్ని దౌర్జన్యం చేశాడు. చివరికి పెళ్లి ఆగిపోయింది. దీంతో యువతి ఈనెల 27వ తేదీ రాత్రి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# పెద్దాసుపత్రికి మూడు ఏసీలు విరాళం

## సూపరింటెండెంట్‌కు ఏసీలను అందజేస్తున్న మెడికవర్ హాస్పిటల్ కర్నూలు సెంటర్ హెడ్ వై. మహేశ్వరరెడ్డి



కర్నూలు(టుడే విదుర, జూన్ 27): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కర్నూలు మెడికవర్ హాస్పిటల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స కింద మూడు ఏసీలను విరాళంగా అందించారు. ఉదయం కర్నూలు జీజీహెచ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు చాంబర్‌లో మెడికవర్ హాస్పిటల్ కర్నూలు సెంటర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి ఏసీలను అందించారు. కార్యక్రమంలో అడ్మిని స్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల పాల్గొన్నారు.

# 2.28 కోట్ల మందితో మెగా పీటీఎం 2.0

## జూలై 5న నిర్వహణకు నిర్ణయం



అమరావతి, (టుడే విదుర, జూన్ 27): మెగా పేరెంట్- టీచర్స్ మీటింగ్(పీటీఎం)-2.0ను జూలై 5న నిర్వహించాలని నిర్ణయించినట్లు సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. 61,135 విద్యాసంస్థల్లో 2,28,21,454 మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామని వెల్లడించారు. 74.96 లక్షల మంది విద్యార్థులు, 3.32 లక్షల మంది ఉపాధ్యాయులు, 1.49 కోట్ల మంది తల్లిదండ్రులు, దాతలు, ఇతరులు పాల్గొంటారని పేర్కొన్నారు. దీనిపై ఆయన మార్గదర్శకాలు విడుదల చేశారు.పీటీఎం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా పురోగతి, ప్రవర్తన, సామాజిక సమస్యల అవగాహన వంటి అంశాలను టీచర్లు నేరుగా తల్లిదండ్రులకు వివరించే అవకాశం ఏర్పడుతుందన్నారు. గతేడాది మొదటిసారి మెగా పీటీఎం జరిగిందన్నారు. ఈ మెగా పీటీఎంలో విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందిస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలల పనితీరు, మౌలిక సదుపాయాలు, వాటిలో లోపాలు, కార్యాచరణ ప్రణాళికలను వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగా కుటుంబ ఫొటో బూత్‌లు, డ్రీమ్ వాల్స్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, అమ్మ పేరుతో మొక్క నాటడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని మార్గదర్శకాల్లో వివరించారు.డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలుపాఠశాలల పనివేళలు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ప్రధానోపాధ్యాయులతో ఎలాంటి సమావేశాలు నిర్వహించొద్దని ఆర్జేడీలు, డీఈవోలు, డీవైఈవోలను పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు. తరగతులు నిర్వహించే సమయంలో సమావేశాలు పెట్టడం వల్ల బోధనకు అంతరాయం కలుగుతోందన్నారు.

# ఎరువు.. బరువు



## బస్తాపై రూ.50 అదనం
## %కాంప్లెక్స్ ఎరువు కొంటేనే ఇస్తామంటున్న డీలర్లు
## ఆర్థికభారంతో అవస్థలు పడుతున్న రైతులు

దేవనకొండ, (టుడే విదుర, జూన్ 27): మండలంలో దాదాపు 40 వేల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేక వాటి ధరలు పెరిగిపోయాయి. దుకాణదారులు బస్తాపై రూ.50ల నుంచి రూ.వంద వరకు రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. అలాగే అదనంగా కాంప్లెక్స్ ఎరువు కొంటేనే ఇస్తామని షరతు విధిస్తున్నారు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు.ప్రైవేటు దుకాణదారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. యూరియా,14,35,15, 14,14,0,28 ,20,20,0,13 ఎరువులను కోనుగోలు చేసేందుకు దుకాణాలకు వెళ్తే అందుబా టులో లేవని దుకాణదారులు అంటున్నారు. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచి అమ్ముతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా ప్రభుత్వ ధర రూ.270లు కాగా డీలర్లు రూ.300ల వరకు వసూలు చేస్తున్నారు. అలాగే యూరియా కావాలంటే, కాంప్లెక్స్ ఎరువును కొంటేనే ఇస్తామని రైతులపై ఒత్తిడి తేస్తున్నారు.నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేశా. టర్నింగ్ వద్ద ఉన్న ఎరువుల దుకాణంలో 20,20,0,13 బస్తా ధర రూ.1300లు కాగా దుకాణాదారుడు రూ.1,350లు చెప్పాడు. దీంతో వెనక్కు వచ్చా. వ్యసాయాధికారులు చర్యలు తీసుకోవాలి.

# విద్యుత్తు అంతరాయాలపై డ్రోన్లతో పరిశీలన

## ఏపీసీపీడీసీఎల్‌పై సమీక్షలో సీఎస్ విజయానంద్ ఆదేశాలు

సదా మీసేవలో...

అమరావతి, (టుడే విదుర, జూన్ 27): విద్యుత్తు అంతరాయాలపై డ్రోన్లతో పరిశీలన చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్తును సరఫరా చేయాలని సూచించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సరఫరాపై ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. విద్యుత్తు శాఖపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంచే దిశగా పని చేయాలని, గృహ, పరిశ్రమలకు నిరంతర విద్యుత్తు అందించాలని చెప్పారు.

# 'లెక్క' లేకుండా..



- ♦ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో నిధుల గోల్‌మాల్
- ♦ ఎన్టీఆర్ యూనివర్శిటీ నుంచి ఇచ్చిన డబ్బుకు లెక్కల్లేవ్..!
- ♦ 2013-2020 వరకు గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలు
- ♦ 2020-2025 వరకు ఇచ్చిన నిధుల్లోనూ అవకతవకలు
- ♦ లెక్కలు అప్పగించాలంటూ ఎన్టీఆర్ వర్శిటీ నోటీసులు
- ♦ డీఎంఈ కార్యాలయంలోని అధికారి అండతోనేనా?

(టుడే విదుర, జూన్ 27): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలోని ఎంబీబీఎస్, నర్సింగ్, పారామెడికల్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రతి కాలేజీకి నిధులు కేటాయిస్తారు. ఇలా సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఇన్విజిలేటర్లకు ఇచ్చే సొమ్ములో భారీగా అవకతవకలు జరిగినట్టు వెలుగుచూసింది. దాదాపు రూ.అరకోటి మేర గోల్‌మాల్ జరిగినట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ తతంగం 2013 నుంచి ఇప్పటివరకు జరిగినట్టు తెలుస్తోంది. ఇటీవల బదిలీపై వెళ్లిన ఓ అధికారి లెక్కలు అప్పగించటంతో ఈ బాగోతాలన్నీ బయటకు వస్తున్నాయి.

**గోల్‌మాల్ ఎలా..?**

2013 నుంచి 2020 వరకు సుమారు రూ.కోటి నిధులు అందించామని, ఇప్పటి వరకు వాటికి లెక్కలు చెప్పలేదని ఇటీవల ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ నుంచి సిద్ధార్థ మెడికల్ కాలేజీ యాజమాన్యానికి తాఖీదులు అందాయి. ఈ నేపథ్యంలో నెలలో అకౌంట్ల లావాదేవీలు తేల్చాలని సిద్ధార్థ మెడికల్ కాలేజీ యాజమాన్యం సంబంధిత ఉద్యోగిని ఆదేశించింది. ఆ ఉద్యోగి లెక్కలు అప్పగించి వెళ్లిపోయారు. ఈ నివేదిక ద్వారా పదేళ్లుగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఇచ్చిన డబ్బుకు ఇప్పటి వరకు ఎలాంటి వ్యయ నివేదికలను సమర్పించలేదని తెలిసింది.

**ఆ సీనియర్ అసిస్టెంట్ ఎవరు?**

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో గతంలో ఒక సీనియర్ అసిస్టెంట్ యూనివర్శిటీ నుంచి వచ్చిన నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. నిధుల ఖర్చుకు సంబంధించి ఎలాంటి స్టేట్‌మెంట్లు ఇవ్వకపోవటంతో ఆ సీనియర్ అసిస్టెంట్‌కు చార్జిమెమో ఇచ్చారు. ఆ ఉద్యోగిపై మే నెలలో విచారణ కూడా జరిపారు. ఆ తర్వాత ఇన్‌చార్జిగా వచ్చిన వ్యక్తి కూడా నిధుల వినియోగానికి సంబంధించిన లెక్కలు అప్పగించనట్టు తెలుస్తోంది. కాలేజీ ఎగ్జామినేషన్ అకౌంట్‌కు తన సొంత అకౌంట్ నుంచి చలానా రూపంలో ఓ ఉద్యోగి డబ్బు కట్టిన ఉందంతం తాజాగా వెలుగుచూసింది. అలాగే, దారి మళ్లించిన కొంత డబ్బును కూడా ఇటీవల తిరిగి చెల్లించినట్టుగా తెలుస్తోంది. వైద్యులు, సిబ్బందికి పేమెంట్లు ఇవ్వకుండా ఇచ్చినట్టు వారి పాత సంతకాలను ఫోర్జరీ చేయటంతో పాటు రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్టు కూడా ఆరోపణలు వస్తున్నాయి

# ఉత్తరాంధ్రలో బయోటెక్ పార్క్



## ఏర్పాటుకు అనుమతివ్వండి..
## కేంద్రాన్ని కోరిన మంత్రి కొండపల్లి

అమరావతి, (టుడే విదుర, జూన్ 27): ఉత్తరాంధ్రలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఫంక్షనింగ్ యూనివర్సిటీతో కూడిన బయోటెక్ పార్కును ఏర్పాటు చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కొండపల్లి శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాపరావు జాదవ్‌ను కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ బయోటెక్ పార్కులో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఫంక్షనింగ్ యూనివర్సిటీని స్థాపించడం ద్వారా పరిశ్రమ, పరిశోధన, విద్యార్థుల మధ్య సహకారాన్ని పెంచి, భారతీయ ఆయుర్వేదాన్ని ప్రపంచ స్థాయిలో ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి జాదవ్ సానుకూలంగా స్పందించారని మంత్రి కొండపల్లి తెలిపారు.


# ప్రభుత్వ లాంఛనాలతో మొహర్రం



## మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డితో నవాబు వారసులు
## రూ.10 లక్షల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
## రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

బనగాన (టుడే విదుర, జూన్ 27): పట్టణంలో ప్రభుత్వ లాంఛనాలతో ఈ ఏడాది మొహర్రం వేడుకలు నిర్వహించనున్నట్లు ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తెలి పారు. రాత్రి పట్టణంలోని ఆస్థానం పీర్ల వద్ద మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, నవాబు వారుసుడు మీర్ ఫజిల్ అలీఖాన్, షియా ముస్లింలతో కలసి ప్రార్ధనలు చేశారు. మతగు రువులతో పాటు షియా ముస్లింలు బీసీకి ఘన స్వాగతం పలికారు. మొహర్రం సందర్భంగా మంత్రి బీసీ ప్రత్యేక చొరవతీసుకొని సీఎం చంద్ర బాబు, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సహకారంతో మొహర్రం వేడుకలు నిర్వహించ డానికి రూ.10లక్షలు నిధులు కేటాయించార న్నారు. వీరికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్థానం పీర్లను మంత్రి బీసీ సందర్శించారు. ఆస్థానం బంగారు పీర్లవద్ద మంత్రి బీసీ ప్రత్యేక ఫాతేహాలు చేశారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తొలిసారి బనగానపల్లెలో మొహర్రం వేడుకలకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించా మన్నారు. ముంబై తర్వాత బనగానపల్లెలోనే ఈ వేడుకలు భారీగా నిర్వహిస్తారన్నారు. ప్రజలు కులమతాలకతీతంగా ఈవేడుకలు సంతోషంగా జరుపుకోవాలని మంత్రి కోరారు. మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. నవాబు వారసుడు మీర్ ఫజిల్ అలీఖాన్ మాట్లాడుతూ తొలిసారిగా ప్రభుత్వం రూ.10లక్షలు నిధులు కేటాయించి నందుకు సీఎం చంద్రబాబునాయుదు, మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు, మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# పల్నాడు జిల్లాలో అమానుష ఘటన..
# నవ వధువుపై అత్యాచారయత్నం



పల్నాడు:(టుడే విదుర, జూన్ 27): జిల్లాలో అమానుష ఘటన జరిగింది. నవవధువుపై అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. అమరావతి మండలం అత్తలూరులో 20 రోజుల క్రితం ఆమెకి వివాహమైంది. వివాహం అయినప్పటి నుంచి నలుగురు యువకులు వివాహితను వేధిస్తున్నారు. భర్త ఇంటిలో లేని సమయంలో భార్యపై అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. అత్యాచారయత్నం చేస్తున్న సమయంలో మరో యువకుడు వీడియో రికార్డింగ్ చేశాడు. అదే సమయంలో భర్త ఇంటికి వచ్చాడు. భర్తను చూసి యువకులు ఘర్షణ పడ్డారు. అనంతరం అక్కడి నుంచి యువకులు పారిపోయారు. ఈ ఘటనతో ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వైద్యపరీక్షల నిమిత్తం బాధితురాలని గుంటూరు జీజీహెచ్‌కి కుటుంబ సభ్యులు తరలించారు. ఆమెకి జీజీహెచ్‌లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన తర్వాత నిందితులు పరారీ అయ్యారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. యువకులపై గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితురాలి కుటుంబ సభ్యులు కోరారు.

# అసంపూర్తి నిర్మాణాలతో ఇబ్బందులు

## అవస్థలు పడుతున్న విద్యార్థులు, భోజన ఏజెన్సీ



అమడగూరు, (టుడే విదుర, జూన్ 27): మండలంలోని జౌకల కొత్తపల్లి లో జిల్లా పరిషత ఉన్నత పాఠశాల విద్యార్థులు అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నారు ఈ పాఠశాలలో దాదాపు 80మందికి పైగా చదువుతున్నారు. ఈ పాఠశాలకు గత వైసీపీ ప్రభుత్వంలో నాడు – నేడు పథకం కింద మూడుఅదనపు తరగతి గదులు, వంటగదితో పాటు మరుగుదొడ్లను మం జూరు చేశారు. పనులు మొదలు పెట్టి గోడల వరకు నిర్మించారు. అక్కడి తో పనులు అగిపోయాయి. ఫలితంగా విద్యార్థులు అసౌకర్యాలతో ఇబ్బం దులు పడుతున్నారు. తరగతి గదుల సంగతి ఎలా ఉన్నా... మరుగుదొడ్ల నిర్మాణం పనులు ఆగిపోయాయి. దీంతో విద్యార్థినులు అవస్థలు పడాల్సి వస్తోంది. అలాగే వంటగది విషయంలోనూ సమస్యగానే ఉంది. మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారు ఇంటి వద్దే భోజనం వండి పాఠశాలకు మోసుకురావాల్సి వస్తోంది. ఆయా గదుల పనులు సకాలంలో పూర్తి అయి ఉంటే, పిల్లలకు చాలా ప్రయోజనకరంగా ఉండేది. ప్రభుత్వం నిధులిచ్చినా పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి ప్రస్తుతం నెలకొంది. దీనికి తోడు చేపట్టాల్సిన పనులకు నిధులున్నా, అయితే పాఠశాల కమిటీ సభ్యులు ఐక్యతతో ముందుకు రావాల్సి ఉంది. పాఠశాల కమిటీ సయోధ్యతో అంగీకారం తెలి పితే పనులు పూర్తిచేయడానికి అవకాశముంది. అధికారులు, పాఠశాల ప్ర?ధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి, విద్యార్థు లకు సరైన సదుపాయాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# మైనింగ్ అక్రమాల పై ఉక్కుపాదం

## చిన్నతరహా ఖనిజాల అక్రమ తవ్వకం, రవాణాకు అడ్డుకట్ట.. మైనర్ మినరల్ నిబంధనల్లో కీలక సవరణలు



అమరావతి,(టుడే విదుర, జూన్ 27): రాష్ట్రంలో ఇసుక, మట్టి, గ్రావెల్, ఇతర చిన్న తరహా ఖనిజాల అక్రమ మైనింగ్, రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చిన్న తరహా ఖనిజాల కన్సెషన్ నిబంధనలకు పదును పెడుతూ కీలక సవరణలు చేస్తూ గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ ఉత్తర్వులు (జీవో 100) జారీ చేశారు. మేజర్ మినరల్స్ మైనింగ్‌లో అక్రమాలను గుర్తిస్తే కనీసం రూ.5 లక్షల జరిమానాతో పాటు ఖనిజం మార్కెట్ విలువ ఆధారంగా అపరాధ రుసుము వసూలు చేసేందుకు నిబంధనలు ఉన్నాయి. మైనర్ మినరల్స్‌లో ఇది లేదు. తాజాగా వీటిలోనూ భారీ పెనాల్టీలను తీసుకొచ్చారు. ఇసుక, మట్టి, రోడ్‌మెటల్, సున్నపురాయి తదితర ఖనిజాల అక్రమ మైనింగ్, రవాణాను గుర్తిస్తే.. వాటి మార్కెట్ విలువ ఆధారంగా భారీ స్థాయిలో అపరాధ రుసుము విధించనున్నారు. ఖనిజాలపై నేతలు, దళారులు కన్నేసి ముందే దరఖాస్తు చేసి రిజర్వ్ చేసుకోకుండా కఠినమైన నిబంధనలు తీసుకొచ్చారు. నిజంగా మైనింగ్ చేయాలనుకునేవారు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా లీజు దరఖాస్తు ఫీజులను భారీగా పెంచారు. ఇంతకు ముందు రూ.వెయ్యి ఫీజు చెల్లించి దరఖాస్తు వేసేవారు. దీంతో భారీసంఖ్యలో వచ్చేవి. ఫలితంగా లీజుల కోసం పోటీ ఉండేది. ఇప్పుడు సగటున ఏ దరఖాస్తు అయినా సరే రూ.10 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, పట్టా, డీకేటీ భూముల్లో లీజులు కోరుకునేవారు సైతం ఒక్కో దరఖాస్తుకు 10 వేలు కట్టాల్సిందే. మైనింగ్ లీజు దక్కకపోయినా ఆ ఫీజు వెనక్కి ఇవ్వరు. ఈ పెంపుదల వల్ల కేవలం మైనింగ్ చేసేవాళ్లే దరఖాస్తుకు ముందుకొస్తారని ప్రభుత్వం భావిస్తోంది. లీజులకు సంబంధించి గనుల శాఖ నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ) తీసుకున్నవారు.. 15 రోజుల వ్యవధిలో ప్రీమియంలో తొలి వాయిదా చెల్లించాలని, మూడు రెట్ల వార్షిక డెడ్‌రెంట్ చెల్లించాలన్న నిబంధన తీసుకొచ్చారు.

## రూ.2వేల నోట్ల మార్పిడి

# ముసుగులో భారీ మోసం

తిరుపతి(టుడే విదుర, జూన్ 27): రూ.రెండు వేల నోట్లు చెలామణిలో లేవు. తగు ఆధారాలు చూపి రిజర్వు బ్యాంకులో మార్చుకోవచ్చు. ఈ వెసులుబాటునే కొందరు తమ మోసానికి అస్త్రంగా వాడుకున్నారు. తమ వద్ద ఎక్కువ మొత్తంలో రూ.రెండు వేల నోట్లున్నాయని నమ్మించారు. తమకు రూ.500 నోట్లతో రూ.కోటి ఇస్తే.. రూ.రెండు వేల నోట్లు రూ.2.5 కోట్లకు ఇస్తామని మైండ్‌గేమ్ ఆడారు. అలా సూళ్లూరుపేటలో ఒకరిని నమ్మించి.. అతడికి రూ.2 వేల నోట్లు ఇవ్వకనే రూ.కోటి కొట్టేశారు. ఈ కేసును పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలను ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుపతిలో మీడియాకు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా కాశిబుగ్గకు చెందిన అంబటి సంతోష్ అలియాస్ చిన్నస్వామి, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన బ్రి రవితేజ, తిరుపతికి చెందిన కె.హేమకర్‌రావు, విశాఖపట్నంలోని కంచర్లపాలెంకు చెందిన మామిడి ఉమామహేష్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు పలువురిని కలుస్తూ తమ వద్దనున్న రూ.రెండు వేల నోట్ల కట్టను చూపుతారు. రూ.లక్షకు రూ.500 నోట్లు ఇస్తే రూ.రెండు లక్షలకు సంబంధించి రెండువేల నోట్లు ఇస్తామని, మీకు రిజర్వు బ్యాంకులో ఎవరైనా తెలిసుంటే మార్చుకోవచ్చని చెబుతారు. ఎవరైనా వీరి మాయలో పడితే డబ్బు తీసుకుని, రూ.రెండు వేల నోట్లు ఇవ్వకుండా పారిపోతారు. ఇలా గత నెలలో సూళ్లూరుపేటలో పలువురిని కలిసి 'డీల్' మాట్లాడారు. ఈ క్రమంలో మినీ ఏటీఎం నిర్వాహకుడు జగదీష్ వీరి వలలో పడ్డారు. రూ.కోటి ఇస్తే తాము రూ.రెండున్నర కోట్లకు రూ.రెండు వేల నోట్లు ఇస్తామని అతడిని వీరు నమ్మించారు. దీంతో అతడు రూ.కోటి సిద్ధం చేసుకున్నారు. గతనెల 7వ తేది



స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

ఈ నిందితులు వాహనాల్లో సూళ్లూరుపేటకు చేరుకుని సమీపంలోని హైవే వద్దకు రమ్మని జగదీష్‌కు చెప్పారు. అతడు రూ.కోటి బ్యాగుతో ఇద్దరు స్నేహితులతో కలిసి అక్కడికి వెళ్లారు. జగదీష్‌తో ఉన్న ఇద్దరిని దగ్గరలో వున్న తమ గదికి వెళితే బాస్ (అంబటి సంతోష్) రూ.రెండువేల నోట్లు రూ.2.50 కోట్లు ఇస్తారని చెప్పి పంపారు. అనంతరం జగదీష్ వద్ద ఉన్న రూ.కోటి బ్యాగును అంబటి సంతోష్ పీఏనని చెప్పిన వ్యక్తి తీసుకుని కారులో పారిపోతుండగా, జగదీష్ అప్రమత్తమై ఆ కారు డోరును పట్టుకున్నారు. కారులోని నిందితులు అతడిని కిందకు నెట్టేసి పరారయ్యారు. మిగిలిన వారూ మరో రెండు వాహనాల్లో పలాయనం చిత్తగించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ చెంచుబాబుకు విషయం తెలిపి సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేశారు. నిందితుల ఆచూకీ కోసం పలు కోణాల్లో దర్యాప్తు చేశారు.

# ఒంటరి ఏనుగు హల్‌చల్



పాక్షికంగా ధ్వంసమైన షెడ్ గోడ

రామకుప్పం,(టుడే విదుర, జూన్ 27): రామకుప్పం మండల అటవీప్రాంత జనానికి మూడ్రోజులుగా ఒంటరి ఏనుగు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కొన్ని నెలలుగా ననియాల అటవీ లోతట్టు ప్రాంతంలో మకాం వేసిన ఈ ఏనుగు.. తోటలు, పొలాలపై దాడులు చేస్తూ భయాందోళనలకు గురిచేస్తోంది. గిట్టుబాటు ధరలేక మామిడి కాయలను చెట్లలోనే వదిలేస్తున్నారు. మాగిన కాయలు నేలరాలిపోతున్నాయి. ఈ పండ్ల వాసన పసిగట్టిన ఒంటరి ఏనుగు.. ననియాల, ఎస్.గొల్లపల్లె తదితర గ్రామాల సమీప తోటలు, పొలాలపై పడుతోంది. నేలరాలిన పండ్లను తింటూ, కాయల్ని నేలరాలుస్తోంది. కొమ్మలు విరిచేస్తోంది. ననియాలకు చెందిన చంద్రమోహన్ దంపతులు తమ పొలంలోని టమోటాలను కోసి రాత్రి అక్కడే ఉన్న షెడ్‌లో ఉంచి.. కాపలా ఉన్నారు. తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో ఒంటరి ఏనుగు వీరి పొలం వద్దకొచ్చింది. ఆ సమయంలో బహిర్భూమికని షెడ్ బయటకు వచ్చిన చంద్రమోహన్ భార్యను చూసి.. ఆమెవైపు వచ్చింది. దూరంనుంచే గమనించిన ఆమె పరుగున గ్రామానికి చేరుకుంది. షెడ్‌లోని చంద్రమోహన్ మాత్రం భయాందోళనతో అక్కడే నక్కి ఉండిపోయాడు. షెడ్ గోడను పాక్షికంగా కూల్చివేసిన ఏనుగు అక్కడినుంచి వెళ్లిపోవడంతో ఆయన తప్పించుకున్నాడు. రాత్రి తిరిగి గ్రామ సమీప పొలాలు, తోటలపై దాడి చేసింది. శంకరప్ప, నాగరాజు, బెంగుళూరుప్పకు చెందిన మామిడి తోటలు, వరి పొలాలపై పడింది. మామిడి చెట్ల కొమ్మలను విరిచేసింది. వరి పైరునూ తొక్కేసింది. ఈ ఏనుగును అటవీ లోతట్టు ప్రాంతం వైపు మళ్లించడానికి అటవీ అధికారులు, ట్రాకర్లు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఒక్కోసారి వారిపై తిరగబడుతోంది. బాణసంచా పేల్చినా జంకడం లేదని ననియాల అటవీ విభాగాధికారి హరికుమార్ తెలిపారు. ఏనుగును రెచ్చగొట్టే ప్రయత్నం చేయొద్దని రైతులకు సూచించారు. రాత్రివేళల్లో పొలాల వద్దకు వెళ్లొద్దని ఆయన చెప్పారు.

# డేంజర్‌లో డిగ్రీ !

- ☞ విద్యార్థులు రాక కళాశాలలు విలవిల
- ☞ సంప్రదాయ డిగ్రీల కంటే వృత్తి విద్యపైనే ఆసక్తి
- ☞ ఉమ్మడి జిల్లాలో 82 కళాశాలల్లో 25 శాతం కంటే తక్కువ అడ్మిషన్లు
- ☞ నోటీసులు జారీ చేస్తున్న ఉన్నత విద్యా మండలి
- ☞ ఇప్పటికి మొదలు కాని అడ్మిషన్లు.. ఆందోళనలో యాజమాన్యాలు



(టుడే విదుర, జూన్ 27): జిల్లాలోని పేరు మోసిన ఓ డిగ్రీ కళాశాలలో 15 ఏళ్ల క్రితం రెండు వేలకుపైగా విద్యార్థులు చదివేవారు. అక్కడ సీటు కావాలంటే మంచి మా ర్కులు రావాలి. లేదంటే రికమం డేషన్ ఉండాలి. ఫీజు సంగతి సరేసరి. అంత డిమాండ్ వుండేది. కాని, ఇప్పుడా కళాశాలలో విద్యార్థుల సంఖ్య 500లోపే. అడ్మిషన్స్ కోసం విద్యార్థు లను ఆకర్షించేందుకు జాబ్‌మేళాలు, ప్రత్యేక క్యాంపెయిన్‌లు చేయాల్సిన పరిస్థితి. ఇదే పరిస్థితి ఉమ్మడి పశ్చిమ లో చాలా కాలేజీల్లో నెలకొంది.

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 25 శాతంకంటే తక్కువ అడ్మిషన్స్ వున్న కళాశాలలపై దృష్టి సారించింది. రాబోయే రోజుల్లో పలు ఆంక్షలు విధించేందుకు ఆ తరహా కళాశాలల జాబితాను సిద్ధం చేసింది. వీటికి ఉన్నత విద్యామండలి నోటీసులు జారీ చేసింది. ప్రత్యేక కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని అందులో సూచించింది. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత వాటి అనుమతులపై స్పష్టత వస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 4.55 లక్షల సీట్లు వుంటే ఇందులో 39 శాతం కూడా భర్తీ కావడం లేదు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే డిగ్రీ కళాశాలలు డేంజర్ జోన్‌లో ఉన్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వృత్తి నైపుణ్య కోర్సుల వైపు మొగ్గు చూపడం, డిగ్రీ కోర్సులపై అయిష్టత వ్యక్తం చేయడంతో డిగ్రీ చదువులు ప్రశ్నార్థకంగా మారాయి. ఆచార్య నన్నయ్య యూనివర్శిటీ పరిధిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 208 కళాశాలలు ఉన్నాయి. వీటిలో అత్యధిక కళాశాలల్లో అడ్మిషన్స్‌లు లేక విలవిల్లాడుతున్నాయి. వీటి నిర్వాహకులు, యాజమాన్యాలు అడ్మిషన్స్ కోసం ఆశగా ఎదురుచూడటం, క్యాంపెయిన్లు, జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ ఆశించినంత ఫలితాలు ఉండడం లేదు.

**డేంజర్‌లో 82 కళాశాలలు**

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 208 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 82 కళాశాలల్లో ఏదో ఒక కోర్సులో కాని, మొత్తం కోర్సుల్లో 25 శాతంకంటే తక్కువ అడ్మిషన్స్ ఉన్నట్టు విద్యాశాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. 25శాతం కంటే తక్కువగా అడ్మిషన్స్ ఉన్న కళాశాలల అనుమతి రద్దు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. ఈ తరుణంలో నిర్వాహకులు అడ్మిషన్స్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది అడ్మిషన్స్ ఇంకా మొదలు కాకపోవడంతో కళాశాల అనుమతులు పొందాలంటే ఆయా కోర్సుల్లో 25 శాతం మంది విద్యార్థులు చేరాల్సిన పరిస్థితి. డిగ్రీ చదవాలనుకున్న వారు ఎక్కువగా ఇంటర్ తర్వాత ఇతర వృత్తులు నేర్చుకుంటూ వేరేచోట జీతానికి పనిచేస్తూ దూరవిద్య ద్వారా డిగ్రీ చదివేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో చాలా డిగ్రీ కళాశాలలు రెగ్యులర్ డిగ్రీతోపాటు దూర విద్యా కోర్సులకు వారి కళాశాలల్లో అడ్మిషన్స్ తీసుకుంటున్నారు. వాటి ద్వారా ఏటా దూరవిద్యలో రెండు వేలకు పైగా విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేస్తున్నారు. మరోవైపు జూన్ నెల ముగుస్తున్నా.. ఇప్పటికీ అడ్మిషన్లు మొదలు కాకపోవడంపైన ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఆ రెండు గ్రూపులకే డిమాండ్..**

బీఏ, బీకాం, బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కంప్యూటర్స్, బీఏ హిస్టరీ వంటి 70 వరకూ బ్రాంచిలు ఉన్నాయి. అన్నింటిలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్స్ కోర్సులకే అధిక డిమాండ్ ఉంది. మిగిలిన బ్రాంచిల్లో చేరేందుకు విద్యార్థులు ముందుకు రాకపోవడంతో వాటికి ప్రాధాన్యత సన్నగిల్లింది. ఆ కోర్సులకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున మూడేళ్లకు రూ.60 వేలు ఖర్చవుతోంది.

## ఆ కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి



గుంతకల్లు, (టుడే విదుర, జూన్ 27): పట్టణంలో అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ ఎన భవాని అధ్యక్షతన గుంతకల్లు పురపాలక సంఘ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో టీడీపీ కౌన్సిలర్లు కే కృపాకర్, పవనకుమార్ గౌడు మాట్లాడుతూ.. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని, ఇంజనీరింగ్ శాఖ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని, పట్టణంలో కనీసం రెండు రోజులకోసారైనా చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమా వేశంలో కమిషనర్ నయ్యాం అహ్మద్, కౌన్సిలర్లు అనూరాధ, గుడిపాటి ఆంజనేయులు, విద్యారాణి, నాగరత్న పాల్గొన్నారు.

# పని ఒత్తిడి తగ్గించాలి



కుందుర్పి, (టుడే విదుర, జూన్ 27): తమపై పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు మండల అభివృద్ధి అధికారి లక్ష్మీశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. స్వచ్ఛభారత షెడ్ల నిర్వహణలో శానిటేషనలో ఉదయం 7 గంటలలోగా హాజరు కావాలని, జీఎసడబ్ల్యూఎస్ సర్వేలకు ప్రతి డిపార్ట్‌మెంట్‌లో తమను బాధ్యులుగా చేస్తూ మెమోలు, సస్పెన్షన చేస్తున్నారని వాపోయారు. కేవలం మాతృశాఖకు సంబంధించిన కార్యక్రమాలు మాత్రమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆనంద్, రాఘవ, రామాంజినేయులు హరీష్, నవీన ఓబుళపతి రాఘవేంద్ర పాల్గొన్నారు.

# మామిడి రైతులకు ఊరట



లఫుడ్ ఇన్స్ ఫ్యాక్టరీ వద్ద నిలిచి ఉన్న ట్రాక్టర్లు

గుడిపాల, (టుడే విదుర, జూన్ 27): మామిడి రైతులకు ఊరట కల్గించేలా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 'అన్‌లోడింగుకు దారేది? కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై ఆయన తీవ్రంగా స్పందించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రోజూ 150 నుంచి 200 ట్రాక్టర్ల వరకు ఫ్యాక్టరీలోకి పంపించేలా చూడాలన్నారు. సిఫార్సులకు స్వస్తి పలికి రైతులు తీసుకొచ్చిన మామిడి కాయలను ఒకటి, రెండ్రోజుల్లోగా అన్‌లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా, కూడా తాసా ఫ్యాక్టరీకి సంబంధించి చీలాపల్లె మిట్ట వరకు ట్రాక్టర్లు నిలిచిపోగా.. గొల్లమడుగు వద్ద ఉన్న ఫుడ్ ఇన్స్ ఫ్యాక్టరీ నుంచి తమిళనాడు సరిహద్దులోని బాంబుల ఫ్యాక్టరీ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రైతులతో తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడారు. ఇకపై టోకెన్లను జారీ చేస్తామని, సీరియల్ ప్రకారం అన్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంట పూర్తిగా ఫ్యాక్టరీకి తోలేవరకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ రైతుల ఖాతాల్లో జమ చేస్తామని భరోసా ఇచ్చారు.

# చిత్తూరులో రెచ్చిపోయిన దొంగలు.. ఏం చేశారంటే..



చిత్తూరు:(టుడే విదుర, జూన్ 27): చిత్తూరులో దొంగలు రెచ్చిపోయారు. ప్రయాణికులను భయపెట్టి అందిన కాడికి దోచుకెళ్లారు. బీహార్ తరహాలో ట్రైన్ ఆపి మహిళల మెడలోని తాళిబొట్లు, చైన్లను దుండగులు గుంజుకెళ్లారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిత్తూరు – కాట్పాడి రైల్వేమార్గం సిద్ధంపల్లి వద్ద నిన్న అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. బెంగళూరు వైపు వెళ్తున్న చామరాజు నగర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ 16219లో విద్యుత్తు సరఫరా ఆపేసి ఈ దారుణానికి దొంగల ముఠా పాల్పడ్డారు. ఈ ఘటన చిత్తూరులో కలకలం సృష్టించింది. ఈ ఘటన నేపథ్యంలో ప్రయాణికులు స్టేషన్‌కి రావాలంటేనే జంకుతున్నారు. అయితే ఇంత జరిగిన ఈ ఘటనను గోప్యంగా రైల్వే పోలీసులు ఉంచారు. ఈ ఘటన నేపథ్యంలో చిత్తూరు రైల్వే స్టేషన్‌లోకి భారీగా పోలీసు బలగాలు చేరి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. నిందితులను పట్టుకోవడానికి పోలీసులు దగ్గరలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# బియ్యం ఎగుమతులపై నిఘా

## పోర్టు ద్వారా రేషన్ బియ్యం విదేశాలకు వెళ్లకుండా నియంత్రించేందుకు టాస్క్ ఫోర్స్

## పౌర సరఫరాలు, రెవెన్యూ, పోలీస్, పోర్టు అధికారులతో ఏర్పాటు

## బియ్యం టెస్టింగ్‌కు పోర్టులోనే లేబొరేటరీ...



విశాఖపట్నం, (టుడే విదుర, జూన్ 27): రేషన్ బియ్యం నగరంలోని పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి అవుతున్నట్టు సమాచారం అందుతుండడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. పౌర సరఫరాలు, రెవెన్యూ, పోలీస్, పోర్టు అధికారులతో ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ నేతృత్వంలో అధికారులతో ఒక సమావేశం నిర్వహించనున్నారు. పౌర సరఫరాల మంత్రిత్వశాఖ నుంచి వచ్చిన సమాచారం మేరకు అధికారుల్లు కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్లపై దాడులు చేసి 473 టన్నుల బియ్యం పట్టుకున్న సంగతి తెలిసిందే. వాటి నుంచి నమూనాలను సేకరించి టెస్టింగ్‌కు లేబొరేటరీకి పంపారు. ఆ బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందినవా?, కాదా?...అనేది ఒకటి, రెండు రోజుల్లో తేలనున్నది. గత ఏడాది కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం భారీగా పట్టుకున్నారు. కాకినాడ పోర్టుపై నిఘా ముమ్మరం చేయడంతో రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేసే వ్యాపారులంతా విశాఖ పోర్టును తమ కార్యస్థానంగా మార్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ గత ఏడాది ఒకసారి పోర్టు నుంచి ఎగుమతులు చేసే కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్లలో తనిఖీలు చేసి రెండుచోట్ల బియ్యం పట్టుకున్నారు. ఒక చోట పట్టుకున్న బియ్యం చౌక డిపోల నుంచి వచ్చినవేనని నిర్ధారణ కావడంతో కేసు నమోదుచేయించారు. విశాఖ పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతులు కొనసాగుతున్నట్టు ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో నిరంతరం పోర్టులో పనిచేసేలా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు. ఏపీలో చౌక డిపోల్లో ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. అందువల్ల రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ బియ్యం కొనుగోలు చేసి విశాఖ పోర్టుకు తీసుకువస్తే వెంటనే నిర్ధారించవచ్చు. అదే ఛత్తీస్‌గఢ్‌లో కొన్ని జిల్లాల్లో ఫోర్టిఫైడ్ రైస్‌ను, మరికొన్ని జిల్లాల్లో సాధారణ బియ్యం అందిస్తున్నారు. సాధారణ బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిందో, కాదో...నిర్ధారించడం వెంటనే సాధ్యంకాదని అధికారులు చెబుతున్నారు. వాటిని లేబొరేటరీకి పంపితే కొంతవరకూ గుర్తించవచ్చునంటున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ పోర్టు పరిధిలోనే బియ్యం టెస్టింగ్ లేబొరేటరీ ఒకటి ఏర్పాటుచేయాలని యోచిస్తున్నారు. పోర్టు నుంచి రేషన్ బియ్యం రవాణాను పూర్తిగా అరికట్టేలా నిఘా ముమ్మరం చేస్తామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. త్వరలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి పోర్టు నుంచి రేషన్ బియ్యం ఎగుమతులకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

# ఇదేనా..! స్వచ్ఛభారత

## పత్తూరు ఆయూష్మాన్ భవన్‌కు వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్తాచెదారం



ఖాజీపేట, (టుడే విదుర, జూన్ 27): స్వచ్ఛభార త.. స్వచ్ఛంధ్ర.. స్వర్ణాంధ్ర అంటూ పరిశుభ్రత పెంపొందించాలంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్నా చాలా చోట్ల అవి మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇందుకు నిదర్శనం ఖాజీపేట మండలం పంచాయతీ కేంద్రమైన పత్తూరు ఆయూష్మాన్ భవన్‌కు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరు వైపులా చెత్తకుప్పలు పేరుకుపోయి అపరిశు భ్రత కు నిలయాలుగా మారాయి. గ్రామాలు, పట్టణా ల్లో చెత్తచెదారాలు లేకుండా పరిశుభ్రత పెంపొం దించడానికి స్వచ్ఛభారత్ పథకం కింద కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుంటే ఇలా పంచాయతీ కేంద్రాల్లోనే చెత్తకుప్పలు దర్శనమి స్తున్నాయంటే ఇక గ్రామాల పరిస్థితి ఎలా ఉం టుందో ఊహించవచ్చు. ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛభారత, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నా చెత్తకుప్పలు పేరుకుపోతుండడం గమనార్హం. మండల స్థాయి అధికారులు కార్యాలయాల ముందు కొన్ని చోట్ల పిచ్చిమొక్కలు తొలగించడంతోపాటు ర్యాలీ చేపట్టి ఫొటోలకు ఫోజులివ్వడం వాటిని ఆనలైన ద్వారా ప్రభుత్వానికి మేము ఇది చేశాం, అది చేశాం అంటూ పంపి కార్యక్రమం మమ అనిపిం చారు. దీంతో తహసీల్దార్ కార్యాలయం, బాలికో న్నత పాఠశాల ఆవరణాలతోపాటు దయాంఖా నపల్లెకు వెళ్లే రహదారి చెత్తకుప్పలకు నిలయా లుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పం దించి చెత్త రహిత సమాజం కోసం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

## మొగిలిగుండాల రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మి తదితరులు

## టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



తాళ్లూరు, (టుడే విదుర, జూన్ 27): అభివృ ద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ని యోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అ న్నారు. మండలంలోని శివరాంపురం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న మొగిలిగుండాల రిజర్వాయర్, 132/33 కెవీ విద్యుత్ స బ్‌స్టేషన్ నిర్మాణ పనులను డాక్టర్ లక్ష్మి, లలి త్‌సాగర్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా రిజర్వాయర్ వద్ద జరిగిన సభలో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గత వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిం దన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు పాలన వికాసం వైపు పయనిస్తున్నదని చెప్పారు. తాళ్లూరు, పరిసర గ్రామాలకు సాగు నీరిచ్చే మొగలిగుండాల రిజర్వాయర్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూ రు చేసి పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. తదుపరి వైసీపీ పాలనలో కొంతమేర పనులు చేసి బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశారన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ మొగిలిగుండాల రిజర్వాయ ర్ నిర్మాణం పూర్తిచేసి తాళ్లూరు ప్రాంత ప్రజల నీటి కష్టాలు పరిష్కరిస్తామని ఇచ్చిన మాట తీరనుందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు నే తృత్వంలో ప్రజాప్రభుత్వం బిల్లులు విడుదల చేసింద న్నారు. బిల్లులు జమకావటంతో ప్రభుత్వంపై నమ్మకం తో కాంట్రాక్టర్ తిరిగి వేగవంతంగా పనులు చేపడుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. రిజర్వా యర్ పూర్తయ్యేందుకు మరో రూ.2 కోట్లు అవసమవుతాయన్నారు. అధికారులు, మంత్రుల దృష్టికి తీసు కెళ్లి నిధులు మంజూరుచేయించి అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తామన్నారు.

# తొలిసారె తెస్తిమమ్మా..



## ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభం

## తొలిసారె సమర్పించిన ఈవో శీనానాయక్

## దేవస్థానం సిబ్బంది, కుటుంబాలతో కోలాహలం

ఇంద్రకీలాద్రి, (టుడే విదుర, జూన్ 27): : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆషాఢ సారె మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి ఉ త్సవమూర్తిని ప్రధాన ఆలయం నుంచి మహామండపం ఆరో అంతస్థులోకి ఊరేగింపుగా తీసుకొచ్చారు. మొదటి సారెను దేవస్థానం సిబ్బంది తరఫున ఈవో శీనానాయక్ దంపతులు, ఆలయ సిబ్బంది కుటుంబాలతో విచ్చేసి సమర్పించారు. తొలుత ప్రధాన ఆలయం నుంచి సంబరంగా మహామండపం వరకు వచ్చారు. అమ్మవారికి సారె నివేదన చేసి, భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఎల్.దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# టుడే వినోదం

## హుషారైన గీతం



రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తెలుగు థియేట్రికల్ రైట్స్‌ను డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, దిల్ రాజు భారీ ధరకు సొంతం చేసుకున్నారు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్స్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో సినిమా విడుదలవుతోంది. తాజాగా చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'చికిటు'ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ హుషారైన గీతంలో వింటేజ్ స్టైల్లో అదిరిపోయే స్టెప్పులతో అభిమానుల్ని ఖుషీ చేశారు రజనీకాంత్.

## ఈ సారి చదరంగం కాదు రణరంగమే!
## బిగ్‌బాస్‌9.. ప్రోమో వచ్చేసింది




తెలుగు రియాలిటీ షో బిగ్‌బాస్  కు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంత క్రేజ్ ఉందో, ఉంటుందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. సీజన్ ప్రారంభమయ్యే సమయంలో ఆ షోను వ్యతిరేకించేవారు అవాకులు, చవాకులు పేలినా.. ప్రేక్షకుల నుంచి ఆదరణ మాత్రం బాగానే ఉంటుంది. ఇప్పటికి ఎనిమిది సీజన్లు పూర్తి చేసుకున్న ఈ షో తొమ్మిదవ సీజన్‌కు ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా గురువారం సడన్‌గా ప్రోమో విడుదల చేసి వీక్షకులకు, బిగ్‌బాస్ అభిమానులకు షాక్ ఇచ్చారు. %సరికొత్త రూల్స్, టాస్క్‌లతో మరింత ఆసక్తికరంగా ఎవరూ ఊహించిన రీతిలో ఉ ంటుందని హోస్ట్ నాగార్జున  స్పష్టం చేశారు. ఆటలో అలుపు వచ్చినంత తొందరగా గెలుపు రాదు.. ఆ గెలుపు రావాలంటే యుద్ధం చేస్తే సరిపోదు కొన్ని సార్లు ప్రభంజనం సృష్టించాలి. ఈ సారి చదరంగం కాదు రణరంగమే అంటూ ఘూటుగా చెబుతూ షోపై క్యూరియాసిటీ పెంచారు. ప్రస్తుతం ఈ ప్రోమో సోషల్ మీడియాలో బాగా వైలర్ అవుతోంది. మీరూ ఓ ల క్కేయండి. కాగా ఈ షో సెప్టెంబర్లో స్టార్ట్ అవనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో న్యూస్ హాల్‌చల్ చేస్తున్నప్పటికీ మేకర్స్ నుంచి అధికారికి ప్రకటన అయితే రాలేదు. ఇందుకు సంబంధించిన విషయాలు త్వరలో తెలియజేయనున్నారు.

## థగ్‌లైఫ్.. మణిరత్నం క్షమాపణ చెప్పలేదు




ఇటీవల ఎన్నో అంచనాల నడుమ ప్రేక్షకుల మధ్యకు వచ్చి డిజాస్టర్‌గా నిలవడమే కాక తీవ్ర స్థాయిలో విమర్శలు ఎదుర్కొన్న చిత్రం థగ్‌లైఫ్ . అయితే ఈ సినిమా ఫెయిల్యూర్‌కు ఆ చిత్ర దర్శకుడు మణిరత్నం  ప్రేక్షకులకు క్షమాపణ లు చెప్పినట్టు జరుగుతున్న ప్రచారంపై మ ద్రాస్ టాకీస్  స్పందించింది. చిత్ర దర్శకుడు మణిరత్నం ప్రేక్షకులకు సారీ చెప్పినట్టుగా అసత్య ప్రచారం చేయొద్దని  కోరింది. %'ఈ సినిమా చూసిన ప్రేక్షకులు తీవ్ర నిరాశకు లోనయ్యారని, దీంతో అభిమానులకు మణిరత్నం సారీ చెప్పినట్టుగా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఈ వార్తలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను షేర్ చేస్తున్నారు. నిజానికి మణిరత్నం ఎవరికీ క్షమాపణ చెప్పలేదు. ఆ సినిమా అభిమానులను సంతృప్తి పరచలేదని, అందుకే ఆయన సారీ చెప్పినట్టుగా సాగుతున్న ప్రచారం అబద్ధమని మద్రాస్ టాకీస్ స్పష్టం చేసింది.

## కన్నప్ప కల్పితం కాదు మన చరిత్ర




'కన్నప్ప అనే శివ భక్తుడు ఉండేవాడు. ఇప్పటికీ ఆయనను ఆరాధిస్తుంటారు. 'కన్నప్ప' సినిమా కథ కల్పితం కాదు.. అది మన చరిత్ర. మన మధ్యలో జీవించిన ఓ వ్యక్తి కథ' అని అన్నారు హీరో మంచు విష్ణు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కన్నప్ప' ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. కార్యక్రమంలో మంచు విష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమాకు ఇప్పటి వరకు లక్షకు పైగా టికెట్లు తెగాయి. ఇదంతా శివ లీల అనిపిస్తోంది. కుటుంబమంతా కలసి ఈ చిత్రాన్ని హాయిగా చూడాలని కోరుకుంటున్నాను. అందుకే నేను టికెట్ రేట్లు పెంచలేదు. ఏపీలో కొన్ని చోట్ల మాత్రమే పెంచాం. నా నలుగురు పిల్లలు ఈ చిత్రంలో నటించారు. ఓ తండ్రిగా నా పిల్లల్ని తెరపై చూడటం ఆనందంగా ఉంది. దేవుడు, భక్తుడికి మధ్యలో ఎవరూ ఉండాల్సిన పని లేదు. మూఢ నమ్మకాలు అవసరం లేదు. దేవుడి మీద మనసారా భక్తి ఉంటే చాలు అని చెప్పాలని అనుకున్నాం. %ఈ చిత్రంలో మోహన్‌లాల్ పాత్ర ఎవరూ ఊహించని విధంగా ఉంటుంది. ఆ శివుడి ఆశీస్సులతో ఈ శుక్రవారం నాది అవుతుంది' అని అన్నారు. 'ప్రస్తుత తరమంతా 'కన్నప్ప' చిత్రాన్ని చూడాలి' అని కోరారు.

## కన్నప్ప మూవీ రివ్యూ




కన్నప్ప అనగానే సినీ ప్రియులకు కన్నడ కంఠీరవ రాజ్ కుమార్ నటించిన 1955 నాటి 'కాళహస్తి మహత్యం'  చిత్రం జ్ఞప్తికి వస్తుంది. మరి కొందరికి 1976లో బాపు తెరకెక్కించిన 'భక్త కన్నప్ప' గుర్తొస్తుంది. సహజంగానే ఈ రెండు సినిమాలతో తాజా 'కన్నప్ప'ను పోల్చేవారూ ఉ ంటారు. అయితే... ఇవాళ్టి టెక్నాలజీని ఉ పయోగించుకుని, భారీ స్థాయిలో మోహన్ బాబు ఈ సినిమాను నిర్మించారు. హిందీలో 'మహా భారత్' తో పాటు పలు డివోషనల్ సీరియల్స్ ను రూపొందించిన ముఖేష్ కుమార్ సింగ్ దీన్ని డైరెక్ట్ చేశారు.

%కన్నప్ప కథ అందరికీ సుపరిచితమే. కోయ వాడైన తిన్నడు (మంచు విష్ణు ) చిన్నప్పటి చేదు సంఘటనల కారణంగా నాస్తికుడిగా మారతాడు. తమ గూడెం బాగు కోసం నరబలి ఇవ్వాలని చెప్పే మారమ్మ (ఐశ్వర్య భాస్కరన్) అంటే అతనికి పడదు. అయినా తండ్రి నాథనాధుడు (శరత్ కుమార్ మాట కాదనలేక కోపాన్ని నిగ్రహించుకుంటాడు. వీరితో పాటు ఆ ఆటవీ ప్రాంతంలో మరో మూడు కొండ జాతులు నివసిస్తుంటాయి. అందులో భద్రగణం ఉండే గూడెంలో దివ్య శక్తులు కలిగిన వాయులింగం ఉంటుంది. దాన్ని ఇతరుల కంట పడకుండా మహాదేవ శాస్త్రి (మోహన్ బాబు) పూజిస్తుంటాడు. పరమ శక్తివంతమైన ఆ వాయులింగాన్ని కొల్లగొట్టాలని అతి కిరాకుడైన కాలముఖుడు (అర్పిత్ రాంకా) ప్రయత్నిస్తాడు. అతన్ని ఎదుర్కొనడానికి నాలుగు గూడేల ప్రజలు ఒక్కటవ్వాలని నాథనాధుడు చెబుతాడు. మరి నాథనాధుడి కోరికను మన్నించి, వీరంత ఒక్కటి అయ్యారా? కాలముఖుడిని సమర్థవంతంగా ఎదుర్కొన్నారా? నాస్తికుడైన తిన్నడు... ఆస్తికుడిగా ఎలా మారాడు? వాయులింగాన్ని దర్శించుకోవాలని కలలు కన్న తిన్నడి భార్య నెమలి (ప్రీతి ముకుందన్) కోరిక తీరిందా? తిన్నడిని భక్తి మార్గం పట్టించడానికి పరమ శివుడు (అక్షయ్ కుమార్ ... రుద్ర ను ఎలా పావుగా ఉపయోగించాడు? అనేది మిగతా కథ. ధూర్జటి విరచిత శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం గ్రంధంతో పాటు మరి కొన్ని పురాణాల్లోని అంశాలు తీసుకుని తిన్నడి కథను రూపొందించారు. అలా చూసినప్పుడు ద్వాపర యుగంలోని అర్జునుడే ఆ తర్వాత తిన్నడిగా జన్మించాడని అంటారు. అందుకు కిరాతార్జునీయంను ఆధారంగా చూపుతారు.

## శ్రీలీలను.. డామినేట్ చేసిన సమంత




టాలీవుడ్ ముద్దుగుమ్మలు సమంత  డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలలు ప్రస్తుతం సోషల్ మీడియాను ఓ రేంజ్‌లో షేక్ చేస్తున్నారు. దీంతో వారిని చూడడానికి ఫ్యాన్స్, సినీ లవర్స్‌కు రెండు కళ్లు చాలడం లేదు. తాజాగా ముంబైలో నిర్వహించిన జీక్యూ సంస్థ మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ యంగ్ ఇండియన్స్2025 పేరిట నిర్వహించిన కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా అన్ని సినిమా ఇండస్ట్రీల నుంచి హీరోయిన్లు తమదైన శైలిలో భిన్న రీతుల్లో ఒక్కొక్క రకమైన డ్రెస్సింగ్‌తో హాజరై ఆ వేడుకను కలర్‌ఫుల్ చేశారు.

టుడే స్పోర్ట్స్

# టిక్కెట్లు అమ్ముడుపోయాయ్



సిడ్నీ: క్రికెట్ ఆడే దేశాలలో టీమిండియాకున్న క్రేజ్ చెప్ప నలవి కాదు..ఏ దేశంలో పర్యటించినా భారత జట్టు ఆడే మ్యాచ్‌లకు క్రికెట్ ఫ్యాన్స్ పోటెత్తుతారు. దటీజ్ టీమిండియా. ఇకపోతే ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల సిరీసకోసం వచ్చే అక్టోబరు–నవంబరులో భారత జట్టు ఆ దేశంలో పర్యటించనుంది. ఇందులో భాగంగా ఇరు జట్లు మూడు వన్డేలు, ఐదు టీ20లలో తలపడనున్నాయి. సిరీసలో మూడో వన్డే (అక్టోబరు 25)కు సిడ్నీ, తొలి టీ20 (అక్టోబరు 29)కి కాన్‌బెరా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ రెండు మ్యాచ్‌లకు సంబంధించిన టిక్కెట్లను అమ్మకానికి పెట్టగా..హాట్ కేకుల్లా అభిమానులు కొనేశారు.

# భారత్ రెండో టెస్టుకు కుల్దీప్ యాదవ్.. మైఖేల్ క్లార్క్ సంచలన వ్యాఖ్యలు




ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన హెడ్డింగ్లీ టెస్ట్‌లో భారత జట్టు ఓటమి పాలైంది. ఈ క్రమంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్.. గౌతమ్ గంభీర్, శుభ్‌మన్ గిల్‌కు కీలక సూచనలు చేశారు. కుల్దీప్ యాదవ్‌ను మిగతా మ్యాచ్‌ల కోసం ఎంపిక చేయాలని ఆయన అన్నారు. హెడ్డింగ్లీ టెస్ట్‌కు భారత జట్టు ఒక స్పిన్నర్, రవీంద్ర జడేజాను మాత్రమే వినియోగించింది. అయితే స్పిన్నర్ కేవలం ఓ వికెట్ మాత్రమే తీసి, తన ప్రతిభను ప్రదర్శించలేకపోయాడు. ఎడమ చేతి బ్యాట్స్‌మెన్ ముందు ఉన్న రఫ్‌ను ఉపయోగించడంలో జడేజా విఫలమయ్యాడు. దీంతో బెన్ డకెట్ రివర్స్ స్వీప్ చేశాడు. కానీ, చివరి సెషన్‌లో జడేజా తన ప్రతిభను చూపించాడు.కానీ అప్పటికే ఇంగ్లాండ్ జట్టు విజయానికి చేరువైంది. జో రూట్, జేమీ స్మిత్ అజేయంగా నిలిచారు. దీంతో శుభ్‌మన్ గిల్ జట్టు 371 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ విజయవంతంగా ఛేదించి 1–0 ఆధిక్యం సాధించింది. ఈ క్రమంలో కుల్దీప్‌ను ఆడించడం అత్యవసరమని క్లార్క్ భావించాడు. 2015 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన జట్టులో కుల్దీప్ వికెట్ టేకర్?గా నిలిచినట్లు గుర్తు చేశారు. ఈ టెస్ట్‌లో జట్టు చేసిన దాని కంటే ఎక్కువగా ఆడగలడని క్లార్క్ ఓ పోడ్ కాస్ట్ ద్వారా అభిప్రాయంవ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారత జట్టు అదనపు బ్యాటింగ్ గురించి చాలా ఆందోళనతో ఉన్నట్లు తెలిపారు. ఇంగ్లాండ్‌లో గెలవాలంటే ప్రధానంగా వికెట్లు తీయడంపై ఫోకస్ చేయాలన్నారు. ఇదే సమయంలో క్లార్క్.. మోహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణను కూడా ప్రోత్సహించారు. ఎందుకంటే జస్ప్రీత్ బుమ్రా ప్రతి సారి ప్రధాన బాధ్యతను తీసుకోలేరని ప్రస్తావించారు. బుమ్రా మొదటి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసుకున్నాడు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో విఫలమయ్యారు. ఆ క్రమంలో సిరాజ్, ప్రసిధ్ ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు చెప్పారు. మిగతా ముగ్గురు పేసర్లు బాగా బౌలింగ్ చేశారు, కానీ వారు వికెట్లు తీసేందుకు మరింత మెరుగుదలతో ఆడాలని సూచించారు.

# హ్యాట్రిక్ టైటిళ్లతో భారత్ చరిత్ర



కౌలాలంపూర్: ఆసియా స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్సలో భారత్ మూడు టైటిళ్లతో క్లీన్‌స్వీప చేసి చరిత్ర సృష్టించింది. పురుషుల, మహిళల డబుల్స్‌తోపాటు మిక్స్‌డ్ విభాగంలోనూ భారత్ జయభేరి మోగించింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో అభయ్ సింగ్–వెలవన్ జోడీ 9–11, 11–5, 11–5తో పాకిస్థాన్‌కు చెందిన నూర్–నాసిర్‌పై గెలిచింది. మహిళల డబుల్స్ తుది పోరులో జోష్న చినప్ప–అనాహత్ సింగ్ జంట 8–11, 11–9, 11–10తో మలేసియాకు చెందిన ఐన్నా అమానీ–జిన్ యింగ్‌పై, మిక్స్‌డ్‌లో అభయ్–అనాహత్ సింగ్ జోడీ 11–9, 11–7తో మలేసియా జంట రేచల్ అర్నాల్డ్–అమీషన్‌రాజ్ చంద్రన్‌పై విజయం సాధించాయి. దీంతో అభయ్, అనాహత్ డబుల్ టైటిల్స్ సాధించినట్టయింది.

# టెస్టుల్లోనూ స్టాప్ క్లాక్




క్రికెట్‌ను మరింత ఆకర్షణీయంగా, పోటీతత్వం పెంచేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తమ నిబంధనలను మార్చడం పరిపాటి. ఇటీవలే వన్డేల్లో ఒకే బంతి, బౌండరీ క్యాచ్‌లు..ముంబాయ్: క్రికెట్‌ను మరింత ఆకర్షణీయంగా, పోటీతత్వం పెంచేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తమ నిబంధనలను మార్చడం పరిపాటి. ఇటీవలే వన్డేల్లో ఒకే బంతి, బౌండరీ క్యాచ్‌లు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ అంశాలపై రూల్స్‌ను సవరించిన విషయం తెలిసిందే. తాజాగా మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిలో భాగంగా టెస్టుల్లో స్లో ఓవర్ రేట్‌కు చెక్ పెట్టేందుకు స్టాప్ క్లాక్‌ను ప్రవేశపెట్టింది. ఒక రోజులో 90 ఓవర్లు పూర్తి కావాల్సి ఉండగా.. చాలాసార్లు అలా జరగకపోవడం చూస్తూనే ఉంటాం. అందుకే ఇక నుంచి ఓవర్ పూర్తయిన 60 సెకన్లలోపే తర్వాతి ఓవర్‌ను మొదలెట్టాలి. అలా జరగకపోతే ఫీల్డింగ్ జట్టు కెప్టెన్‌ను అంపైర్లు రెండుసార్లు హెచ్చరిస్తారు. మూడోసారి రిపీట్ అయితే మాత్రం పెనాల్టీ కింద ప్రత్యర్థి జట్టుకు అదనంగా ఐదు పరుగులను కోల్పోవాల్సి ఉంటుంది. 80వ ఓవర్ వరకు ఇలా ఎన్నిసార్లు జరిగినా కూడా పెనాల్టీ రన్స్ విధిస్తారు. డబ్ల్యూటీసీ కొత్త సీజన్ (2025–2027) నుంచే ఇది అమల్లోకి వస్తుందని ఐసీసీ వెల్లడించింది. వాస్తవానికి వన్డే, టీ20ల్లో గతేడాది జూన్ ఒకటి నుంచే ఈ స్టాప్ క్లాక్ రూల్ కొనసాగుతోంది. మ్యాచ్ సమయంలో బౌలర్లు బంతికి లాలాజలం పూయడంపై నిషేధం కొనసాగుతోంది. అయితే ఇక నుంచి బౌలర్లు తమ ఉమ్మి పూశారనే కారణంతో అంపైర్లు బంతిని మార్చాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కొత్త బంతి కోసం ఒక్కోసారి బౌలింగ్ జట్టు సభ్యులు కావాలనే ఉమ్మి పూస్తుంటారు.

# అల్కారజ్ 2 క్రెజికోవా 17




లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ చాంపియన్‌షిప ఈనెల 30న ప్రారంభం కానుంది. వచ్చే నెల 13 వరకు జరిగే ఈ టోర్నీకి సీడింగ్‌ల వివరాలను గురువారం వెల్లడించారు. పురుషుల డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్‌కు రెండో సీడింగ్ కేటాయించగా..మహిళల విజేత బార్బరా క్రెజికోవాకు 17వ సీడింగ్ లభించింది. గత సోమవారం విడుదలైన ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా ఈ సీడింగ్‌లు కేటాయించారు. ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ జానిక్ సినర్‌కు టాప్ సీడింగ్ లభించింది. రెండు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ సబలెంక, ఫ్రెంచ్ ఓపెన్ విజేత గాఫ్ టాప్, రెండో సీడింగ్‌లతో బరిలో దిగనున్నారు.

# హైదరాబాద్‌లో జాతీయ బాక్సింగ్ బరిలో లవ్లీనా నిఖత్



: ఎలీట్ మహిళల జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. శనివారం నుంచి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఒలింపియన్లు నిఖత్ జరీన్, లవ్లీనా బొర్గోహైన్, ప్రపంచ యూత్ మాజీ చాంపియన్ అంకుషిత బోరో బరిలోకి దిగుతున్నారు. మొత్తం 15 రాష్ట్రాలకు చెందిన వందమందికి పైగా బాక్సర్లు 10 కేటగిరీల్లో తలపడనున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ బాక్సింగ్ సమాఖ్య సంయుక్తంగా ఈ టోర్నీని నిర్వహిస్తున్నాయి.

# రెండో టెస్ట్‌కు బుమ్రా దూరం



న్యూఢిల్లీ: రెండో టెస్ట్ ముందు భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. టీమిండియా ఎంతో ఆధారపడిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బర్మింగ్‌హామ్ టెస్ట్‌కు దూరమవుతాడన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. తొలి టెస్ట్‌లో మిగతా పేసర్లు విఫలమైనా బుమ్రా ఒంటరి పోరాటం చేశాడు. అయితే, పనిభారం నిర్వహణలో భాగంగా బర్మింగ్‌హామ్ టెస్ట్‌కు బుమ్రాకు విశ్రాంతినివ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు సమాచారం. దీంతో లార్డ్స్‌లో జరిగే మూడో టెస్ట్‌కు అతడు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అయితే, లీడ్స్‌లో అనూహ్యంగా ఓటమిపాలైన భారత్.. పుంజుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత మాజీ ఆటగాడు రవిశాస్త్రి చెప్పాడు. బుమ్రాకు విశ్రాంతినిస్తే భారత్ 0–2తో వెనుకబడే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. 'ఈ సిరీస్‌లో మూడు టెస్టులు మాత్రమే ఆడతానని బుమ్రా చెప్పాడు. కానీ, అవి ఏవేవో చెప్పలేదు. ఒకవేళ రెండో మ్యాచ్‌కు దూరమైతే.. లార్డ్స్ టెస్ట్‌లో కచ్చితంగా ఆడాలనుకొంటాడు. అయితే, బర్మింగ్‌హామ్‌లో బుమ్రా బరిలోకి దిగకపోతే భారత్ 0–2తో వెనుకబడుతుంది. టీమిండియా పోటీలో ఉండాలంటే మాత్రం బుమ్రా ఆడితీరాల'ని శాస్త్రి చెప్పాడు. ఇంగ్లండ్ బౌలింగ్ బలహీనంగా ఉండడంతోపాటు ఆ టీమ్‌ను గాయాల బెడద వెంటాడుతోందన్నాడు.

# విశాఖ ఇండస్ట్రీస్ కేసులో హెచ్‌సీఏకు ఎదురుదెబ్బ



ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో వ్యాపార ప్రకటనల హక్కులకు సంబంధించి విశాఖ ఇండస్ట్రీసతో జరిగిన ఒప్పందం విషయంలో హైదరాబాద్ క్రికెట్ సంఘానికి (హెచ్‌సీఏ) ఎదురుదెబ్బ తగిలింది. విశాఖ ఇండస్ట్రీస్‌తో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయనందుకు హెచ్‌సీఏ రూ.25 92 కోట్లు చెల్లించాలని, ఈ మొత్తం చెల్లించే వరకు 18 శాతం వడ్డీ లెక్కగట్టాలని అర్బిట్రేషన్ అవార్డు జారీ అయింది. ఈ అవార్డును హెచ్‌సీఏ 2016లో కమర్షియల్ కోర్టులో సవాల్ చేయగా 2024లో కమర్షియల్ కోర్టు హెచ్‌సీఏ పిటిషన్‌ను కొట్టేసింది. కమర్షియల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ హెచ్‌సీఏ హైకోర్టులో అప్పీల్ చేసింది. కాగా హైకోర్టులో సైతం హెచ్‌సీఏకు ఎదురుదెబ్బ తగిలింది. హెచ్‌సీఏకు వ్యతిరేకంగా జారీ అయిన అర్బిట్రేషన్ అవార్డును హైకోర్టు సమర్థించింది.

# టుడే బిజినెస్

# విరాట్ కోహ్లీ మరో పెట్టుబడి..
# ఆ కంపెనీలో రూ.40 కోట్లు ఇన్వెస్ట్



క్రికెట్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న విరాట్ కోహ్లీ ఇప్పుడు వ్యాపార రంగంలో కూడా పెట్టుబడులు పెడుతున్నారు. ఈ క్రమంలోనే కోహ్లీ, పూమా ఇండియా మాజీ హెడ్ అభిషేక్ గంగూలీ ప్రారంభించిన క్రీడా వస్త్రాల తయారీ సంస్థ అగిలిటాస్‌లో రూ.40 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. ఈ పెట్టుబడితో కోహ్లీ తన వ్యాపార సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నారు. గంగూలీ, ప్యూమా ఇండియాలో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు, కోహ్లీని కంపెనీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంలో కీలక పాత్ర పోషించారు. 2017లో ప్రారంభమైన రూ.110 కోట్ల ఒప్పందం 2025 వరకు కొనసాగుతుందని సమాచారం.యాజమాన్య హక్కులు

కోహ్లీ కేవలం బ్రాండ్ అంబాసిడర్‌గా మాత్రమే కాకుండా, బెంగళూరులోని అగిలిటాస్ సంస్థలో యాజమాన్య హక్కులు పొందడానికి కూడా ఇన్వెస్ట్‌మెంట్ చేశారు. 2023లో అగిలిటాస్, మోచికో షూస్‌ను కొనుగోలు చేసింది. ఇది అడిడాస్, ప్యూమా, న్యూ బాలెన్స్, స్కెచర్స్, రీబాక్, ఆసిక్స్, క్రోక్స్, డెకాథ్లాన్, క్లార్క్స్, యూఎస్ పోలో వంటి బ్రాండ్లకు షూస్?ని తయారు చేస్తుంది. అగిలిటాస్, ఇండియాలో కొన్ని ఇతర ప్రాంతాల్లో షూస్ అమ్మడానికి లోటో బ్రాండ్లకు లైసెన్సింగ్ హక్కులను కూడా పొందింది. ఈ నేపథ్యంలో కోహ్లీ 8 వంటి ఇతర బ్రాండ్లను కూడా ప్రవేశపెట్టాలని సంస్థ యోచిస్తోంది.కంపెనీ విలువ

ఈ పెట్టుబడితో అగిలిటాస్ అమ్మకాలు పెరిగి, కంపెనీ విలువను పెంచనుంది. చివరికి కోహ్లీ పెట్టుబడికి కూడా విలువ పెరుగుతుంది. కోహ్లీ ప్రారంభ పెట్టుబడి రూ.40 కోట్లు కేవలం మొదటి రౌండ్ మాత్రమే. ఆయన వ్యక్తిగతంగా మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అగిలిటాన్‌లో తన పాత్రను పెంచడానికి కూడా యోచిస్తున్నారని సమాచారం. కోహ్లీ పెట్టుబడుల్లో ఇది కొత్తది కాదు. ఇప్పటికే 10కిపైగా స్టార్టప్స్‌లో ఇన్వెస్ట్ చేశాడు. ఇందులో వంటి పేరున్న కంపెనీలు ఉన్నాయి. ఇప్పుడు అగిలిటాన్‌తో అతడి వ్యాపార ప్రయాణం మొదలైంది. ఇది కేవలం ఇండియా మార్కెట్‌కు పరిమితం కాకుండా, గ్లోబల్ స్థాయిలో విస్తరించాలని చూస్తున్నారు.

# ఇల్లు కొనాలనుకుంటున్నారా..
# ఈ 6 టిప్స్ తప్పనిసరిగా ఫాలో కావాలి



ఇంటర్నెట్ డెస్క్: సొంతిల్లు కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కొందరికి ఈ కల నెరవేర్చుకునే అవకాశాలు కూడా ఉంటాయి. అయితే, ఇల్లు కొనాలనుకునే ముందు కొన్ని టిప్స్ తప్పనిసరిగా ఫాలో కావాలని బ్యాంకర్స్ చెబుతున్నారు. వీటిని తూచా తప్పకుండా ఫాలో అయితే ఎలాంటి ఆర్థిక ఒడిదుడుకులు కలగకుండా సొంతింటి కలను నెరవేర్చుకోవచ్చు. మరి ఈ సూచనలు ఏమిటో ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం సొంతింటి గురించి ఆలోచించేటప్పుడు 'ఏ బడ్జెట్‌లో ఇల్లు కొనాలి' అని చాలా మంది ఆలోచిస్తారు. ఈ ప్రశ్న తప్పని బ్యాంకర్స్ చెబుతున్నారు. మీ బడ్జెట్ ఎంతనే విషయంలో ఓ అంచనాకు వచ్చాక ఇళ్ల కొనుగోలు ప్రయత్నాలు మొదలెట్టాలి. సొంతిల్లు భారం కాకుండా ఉండేందుకు ఈ జాగ్రత్త తీసుకోవడం తప్పనిసరి.ఎంత మేరకు లోన్ లభిస్తుంది అని ప్రశ్నించే బదులు ఎంత మొత్తం వరకూ లోన్ భారం కాదు అన్న ప్రశ్న వేసుకుని అందుకు అనుగుణంగా రుణం తీసుకోవాలి. కుటుంబసభ్యుల మద్దతు, వారసత్వ ఆస్తులు లేని వారు మరింత జాగ్రత్తగా ఉండాలి.మీరు కొనబోయే ఇంటి ధర గరిష్ఠంగా మీ వార్షిక ఆదాయానికి ఐదు రెట్లు ఉండొచ్చు. ఇంతకు మించిన ధర భారంగా మారుతుందని మరవొద్దు ఇక నెలనెలా చెల్లించే ఈఎమ్ఐ వాటా నెలవారీ జీతంలో గరిష్ఠంగా 35 శాతం ఉండొచ్చు. ఈ లిమిట్ దాటితే మాత్రం ఆర్థిక ఒడిదుడుకులను తట్టుకోవడం కష్టం. జీవితం తలకిందులయ్యే ప్రమాదం కూడా ఉంది.ఇంటి ధరలో దాదాపు సగం మొత్తాన్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఇది డౌన్ పేమెంట్‌కు ఉపయోగపడటంతో పాటు ఇంటి కొనుగోలు తరువాత కూడా ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతుంది.ఇంటి కోసం దాచిన సొమ్మును 35:15 నిష్పత్తిలో విభజించి అందులో మొదటి భాగాన్ని ఇంటి కొనుగోలుకు డౌన్ పేమెంట్‌గా వాడుకోవాలి. మిగతా భాగాన్ని నగదు రూపంలో అత్యవసర అవసరాల నిమిత్తం జాగ్రత్తగా పెట్టుకోవాలి. ఈ సూత్రానికి ఎటువంటి మినహాయింపులు లేవు.కనీసం ఐదేళ్ల పాటు ఒకే చోట ఉండాలనుకునే వారు మాత్రం సొంతింటి కోసం ప్రయత్నించాలి. ఇంతకంటే తక్కువ సమయానికి అద్దె ఇల్లే బెటర్. స్వల్పకాలానికి ఇల్లు కొనుగోలు చేస్తే చివరకు నష్టాలే మిగులుతాయి. ట్రాన్సాక్షన్ ఖర్చులు, వడ్డీలు, ఇంటి విలువలో ఎగుడుదిగుడులు వంటివన్నీ నష్టాలకు కారణమవుతాయి.

# సిబిల్ స్కోర్ కారణంగా ఉద్యోగం తొలగింపు..
# హైకోర్టు కీలక వ్యాఖ్యలు




సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలు లోన్స్ ఇవ్వవని చాలా మందికి తెలుసు. కానీ స్కోర్ తక్కువగా ఉండటంతో ఉద్యోగం పోయిందనే విషయం మీకు తెలుసా. అవును మీరు విన్నది నిజమే. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబిల్ స్కోరు తక్కువగా ఉందని ఓ ఉద్యోగిని తొలగించింది. తొలగించాలన్న నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు కూడా సమర్థించింది. ఈ కేసు చెన్నైలోని %ాదీ×%లో సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ నియామకం ద్వారా వెలుగులోకి వచ్చింది. సిబిల్ స్కోర్

బ్యాంక్ నిర్ణయం

ఆ క్రమంలో తొలగింపు ఉత్తర్వును రద్దు చేసి, అతన్ని తిరిగి తీసుకోవాలని ఆదేశించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ కేసులో ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించాల్సిన అవసరం ఉందని మద్రాస్ హైకోర్టు తన ఉత్తర్వులో తెలిపింది. బ్యాంకింగ్ పనుల్లో ప్రజా ధనంతో వ్యవహరిస్తారని, అందువల్ల కఠినమైన ఆర్థిక క్రమశిక్షణను పాటించాల్సిన అవసరం ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. రుణం చెల్లించడంలో డిఫాల్ట్ అయిన అభ్యర్థి సిబిల్ స్కోరు ప్రతికూలంగా ఉన్న నేపథ్యంలో అనర్హులుగా ప్రకటించడానికి బ్యాంక్ నిర్ణయం తీసుకుందని చెప్పింది.

ఎక్కువ వాయిదాలు..

బ్యాంకు సమర్పించిన సిబిల్ నివేదికలో 2016 నుంచి 2021 మధ్య పిటిషనర్‌కు 9 క్రెడిట్ లావాదేవీలు, 10 కంటే ఎక్కువ రుణ దర్యాప్తులు జరిగాయని కోర్టు గుర్తించింది. దీంతో రుణ చెల్లింపులో డిఫాల్ట్ అయినట్లు పిటిషనర్ కూడా అంగీకరించారని కోర్టు తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో అభ్యర్థి వాదనను తిరస్కరించి, కోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో అర్హత ప్రమాణాలలోని క్లాజ్ 1 కింద అతను అనర్హుడని తేలిందని బ్యాంక్ తెలిపింది. పిటిషనర్ ముఖ్యమైన సమాచారాన్ని దాచిపెట్టారని, అందువల్ల ఉద్యోగం కొనసాగించాలని క్లెయిమ్ చేసే హక్కు అతనికి లేదని బ్యాంక్ వెల్లడించింది. పిటిషనర్ ఒకటి కంటే ఎక్కువ వాయిదాలు రుణం చెల్లించలేదని, కాబట్టి దీనిని ఇతర కేసులతో పోల్చలేమని బ్యాంక్ స్పష్టం చేసింది.

ఏం జరిగింది..

పిటిషనర్ జూలై 27, 2020న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారంలో నియామకానికి దరఖాస్తు చేసుకున్నాడు. అతను రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణుడయ్యాడు. తర్వాత మెడికల్ టెస్ట్, ఇతర సర్టిఫికెట్లు, సిబిల్ స్కోర్ చూసిన తర్వాత, అతనికి మార్చి 12, 2021న నియామక లేఖను జారీ చేశారు. కానీ మార్చి 16న దానిపై పిటిషనర్ నుంచి బ్యాంక్ వివరణ కోరింది. పిటిషనర్ స్పష్టత ఇచ్చి ఉద్యోగాన్ని కొనసాగించమని అభ్యర్థించాడు. కానీ చివరకు సిబిల్ స్కోర్ తక్కువ నివేదిక ఆధారంగా అతని నియామక లేఖను రద్దు చేశారు.

# బ్రాండ్ బాజా




న్యూఢిల్లీ: బ్రాండ్ వాల్యూ విషయంలో మన దేశీయ కంపెనీలూ సత్తా చాటుతున్నాయి. ప్రస్తుతం భారత్‌లోని టాప్‌–100 కంపెనీల బ్రాండ్ వాల్యూ 23,650 కోట్ల డాలర్ల (సుమారు రూ.20.27 లక్షల కోట్లు) వరకు ఉంటుందని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా సంస్థ ఒక నివేదికలో తెలిపింది. ఇందులో టాటా గ్రూప్ బ్రాండ్ విలువే 3,160 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.78 లక్షల కోట్లు) మేర ఉందని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం టాటా గ్రూప్ బ్రాండ్ విలువ 10 శాతం పెరిగింది. బ్రాండ్ వాల్యూ 3,000 కోట్ల డాలర్లకు మించిన తొలి భారత పారిశ్రామిక గ్రూప్ కూడా టాటా గ్రూపేనని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా తెలిపింది. బ్రాండ్ వాల్యూపరంగా టాటా గ్రూప్ తర్వాత ఇన్ఫోసిస్ (1,630 కోట్ల డాలర్లు), హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ (1,420 కోట్ల డాలర్లు), ఎల్ఐసీ (1,360 కోట్ల డాలర్లు), రిలయన్స్ గ్రూప్ (980 కోట్ల డాలర్లు), ఎస్‌బీఐ గ్రూప్ (960 కోట్ల డాలర్లు), హెచ్‌సీఎల్ టెక్ (890 కోట్ల డాలర్లు), ఎయిర్‌టెల్ (770 కోట్ల డాలర్లు), ఎల్ అండ్ టీ గ్రూప్ (740 కోట్ల డాలర్లు), మహీంద్రా గ్రూప్ (720 కోట్ల డాలర్లు) వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

# 3 రోజులు రూ 20 లక్షల కోట్లు



ముంబై: పశ్చిమాసియా ఉద్రిక్తతలు సడలిన నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజు కూడా ర్యాలీలో పురోగమించింది. ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడంతో పాటు మార్కెట్ దిగ్గజాలైన హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ కౌంటర్లలో జరిగిన భారీ కొనుగోళ్లు మార్కెట్‌ను గురువారం ఉరకలెత్తించాయి. అంతర్జాతీయ విపణిలో అదుపులోనే ఉన్న క్రూడాయిల్ ధర (బ్యారెల్ 67.80 డాలర్లు) సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. ఈ నేపథ్యంలో గురువారం సెన్సెక్స్ 1000.36 పాయింట్లు లాభపడి 83,755.87 వద్ద ముగియగా నిఫ్టీ 304.25 పాయింట్లు లాభపడి 25,549 వద్ద క్లోజైంది. మూడు వరుస సెషన్లలో సెన్సెక్స్ 1859.08 పాయింట్లు లాభపడింది. బీఎసఈలో లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ విలువ మూడు రోజుల్లో రూ.9.7 లక్షల కోట్లు పెరిగి రూ.457 లక్షల కోట్లకు చేరింది.

ఎన్ఎసఈలో ఎలక్ట్రిసిటీ ఫ్యూచర్స్

రాబోయే రెండు, మూడు వారాల్లో ఎలక్ట్రిసిటీ ఫ్యూచర్స్ కాంట్రాక్టులు ప్రవేశపెట్టనున్నట్టు ఎన్ఎసఈ ప్రకటించింది. విద్యుత్ కొనుగోలుదారులు, విక్రేతలు, ట్రేడర్లు, పారిశ్రామిక రంగం, రిటైలర్లు ధరల రిస్క్ తగ్గించుకోవడానికి ఈ చర్య దోహదపడుతుందని తెలిపింది. త్వరలోనే దీని ప్రారంభ తేదీని ప్రకటించనున్నట్టు ఎన్ఎసఈ పవర్ విభాగం హెడ్ హరీశ్ అహూజా తెలిపారు.ఆర్ఐఎల్ మళ్లీ

20 లక్షల కోట్ల శిఖరం పైకి...

అత్యంత విలువైన దేశీయ కంపెనీ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ మరోసారి రూ.20 లక్షల కోట్ల మార్కెట్ విలువ గల కంపెనీగా అవతరించింది. గురువారం బీఎసఈలో ఆర్ఐఎల్ షేరు 1.90్న లాభపడి రూ.1,495.20 వద్ద స్థిరపడింది. ఎన్ఎసఈలో సైతం అదే శాతం లాభంతో రూ.1,495.30 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.37,837.9 కోట్లు పెరిగి రూ.20,23,375.31 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఇప్పటికి రిలయన్స్ షేరు 23 శాతం లాభపడగా ఫిబ్రవరి 13వ తేదీన ఆర్ఐఎల్ తొలిసారిగా రూ.20 లక్షల కీలకమైన మైలురాయిని చేరింది. మార్కెట్ విలువపరంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.15,51,218.93 కోట్లు), టీసీఎస్ (రూ.12,45,219.09 కోట్లు), భారతి ఎయిర్‌టెల్ (రూ.11,4,8,518.05 కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.10,27,838.79 కోట్లు)తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006